# విలేకరులు కావలెను

పత్రిక రంగంలో మరో సంచలనం, వినూత్న రీతిలో వెలుబడతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టలు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత,
కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్ల ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463



# తీన్మార్

నేటి వాస్తవాలు ... తెలుగు దిన పత్రిక

teenmaardesk@gmail.com

For e-Paper (Scan Now)
https://www.teenmaarepaper.com/

ములుగు | సంపుటి : 02 | సంచిక : 132 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 29 జులై 2023 | పేజీలు : 08 | వెల ₹ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


కుండపోత వర్షాల వల్ల గదుల్లోకి, ప్రాంగణాల్లోకి చేరిన వరదనీరు

గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల దెబ్బతిన్న రవాణా వ్యవస్థ

అంటువ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరిక

విద్యాధికారుల మధ్య చర్చానియాంశంగా మారిన బోధన అంశం





# వర్షాలు తగ్గినా.. చదువు సాగేనా?

తెలంగాణాలో ఇటీవల కురిసిన భారీ మరియు అతి భారీ వర్షాల వల్ల గ్రామాలలో మాత్రమే కాకుండా పట్టణ ప్రాంతాలలో కూడా రోడ్లు ఇరిగిపోవడం, అధిక వరద ప్రవాహాలు, విద్యుత్ స్థంబాలు కూలడం, వరదల ద్వారా కొంత ప్రాణ నష్టం లాంటివి అధిక నష్టం కలిగిందనే చెప్పవచ్చు. అధిక వర్షాల వల్ల రాష్టంలో పాఠశాలలకు అధిక సెలవులు ప్రకటించడం జరిగిన విషయం తెలిసిందే.. కాగా ఈ వర్షాల వల్ల అధిక సంఖ్యలో పాఠశాలలలోకి వరద నీరు తరగతి గదులలోకి, ప్రాంగనాల్లోకి, పాఠశాలల విద్యుత్ బాక్స్ లలోకి చేరడం ద్వారా తరగతులు జరిగే అవకాశం తగ్గువగా ఉండనుందని విద్యాశాఖలో జరుగుతున్న చర్చ. అదే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా రవాణా వ్యవస్థలో బాగమైన రోడ్లు భారీగా విరగడం వల్ల ఇది కూడా ఒక కారణంగా ఉండనుంది. - తీన్మార్ న్యూస్, హైదరాబాద్

వివరాలు 2లో..



2లో

## భారీ వర్షాలతో రాష్ట్రం అల్లకల్లోలమవుతున్నా దొర గడి దాటడు

ట్విట్టర్ ద్వారా కేసీఆర్ పై మండిపడ్డ షర్మిల



2లో

## వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారు

ఆగస్టు 3 నుంచి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు



2లో

## 81 మందికి డిప్యూటీ కలెక్టర్లుగా తహసీల్దార్లకు పదోన్నతి



## దివ్యాంగులపై వివక్షత వేరేదారి చూసుకోక తప్పదా..!

ఏ చరిత్ర చూసిన ఏముంది గర్వకారణం
దివ్యాంగుల ఓటు బ్యాంకు దోపిడి తప్ప

జనాభాలో దివ్యాంగులు 20 శాతం పైనే

దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు
అసలు రావడం లేదు..?

అవకాశాల్లో రోస్టర్ల మార్పును
పట్టించుకునేవారే లేరు

హక్కుల సాధన కొరకు శాంతియుత
పోరాటాలకు సిద్ధం



2 లో..

దివ్యాంగుల హక్కుల, సాధికారిత సంస్థ అధ్యక్షులు మరియు కాకతీయ యూనివర్సిటీ, ప్రజా పాలనా శాస్త్రం ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు



## వసతి గృహ మెస్‌లకు అదనపు సంచాలకులుగా డాక్టర్ సుచరిత పాల్ నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్ టి శ్రీనివాస రావు

**హన్మకొండ కేయు, జులై 28 (తీన్మార్ న్యూస్):** కాకతీయ విశ్వవిద్యాలయ వసతి గృహ మరియు మెస్ లకు అదనపు సంచాలకులుగా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ HRM విభాగ ఒప్పంద అధ్యాపకురాలు, పద్మాక్షి హాస్టల్ సంయుక్త సంచాలకులు డాక్టర్ సుచరిత పాల్ ను తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస రావు ఉత్తర్వులు జరిచేసారు. ఈ పదవి ఒప్పంద అధ్యాపక పదవి తో ముడిపడి ఉంటుంది (కో టెర్మినస్) అని ఆ ఉత్తర్వులులో పేర్కొన్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.

## జంపన్నవాగులో మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరిహారం

ఒక్కొక్కరికి
రూ.4 లక్షలుగా నిర్ణయం

తక్షణ సాయంగా
రూ.25 వేలు అందజేత

నష్టపోయిన వారందరిని
ఆదుకుంటాం :
మంత్రి సత్యవతి రాథోడ్



2లో..



## వర్షాలతో ఇబ్బందులు పడుతుంటే కేసీఆర్ ఎక్కడ.. కేటీఆర్, కవితలెక్కడ..?

బీఆర్ఎస్ స్టీరింగ్
ఎంఐఎం చేతిలో ఉంటే..
కాంగ్రెస్ స్టీరింగ్ కేసీఆర్
చేతిలో ఉంది

సంచలన విమర్శలు
చేసిన బీజేపీ నేత
ధర్మపురి అరవింద్



2లో..

## బలహీన పడ్డ అల్పపీడనం

నేటి నుండి వర్షాలు తగ్గుముఖం



అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు హైదరాబాద్ నగరం అల్లకల్లోలమవుతున్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితిలో నగర వాసులకు వాతావరణ శాఖ అధికారులు తీపి కబురు అందించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం గురువారం ఉదయం బలహీనపడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కె. నాగరత్న తెలిపారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ఇక భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినట్టేనని చెప్పారు. మరోపక్క తెలంగాణపై నైరుతి రుతుపవనాలు ఉద్ధృతంగా ఉన్నాయి. తాజాగా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాలు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో అతి పెద్ద వర్షాలుగా నమోదయ్యాయి. హన్మకొండ సహా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కొన్ని చోట్ల అసాధారణమైన భారీ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, భద్రాద్రి కొత్తగూడెం, కుమురంభీమ్ జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షం కురిసింది. ఆగస్టు రెండో వారం, సెప్టెంబరులో కూడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నాయి. తీవ్ర అల్పపీడనం బలహీనపడి ప్రస్తుతం దక్షిణ ఒడిశా, పరిసరాల్లో ఉత్తరాంధ్ర వద్ద కొనసాగుతోంది. శుక్రవారం పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, 29, 30, 31 తేదీల్లో ఎలాంటి హెచ్చరికలు లేవు అని వాతావరణ కేంద్రం డైరెక్టర్ తెలిపారు.

- తీన్మార్ న్యూస్, హైదరాబాద్

# వర్షాలు తగ్గినా.. చదువు సాగేనా?



**కుండపోత వర్షాల వల్ల గదుల్లోకి, ప్రాంగణాల్లోకి చేరిన వరదనీరు**

**గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల దెబ్బతిన్న రవాణా వ్యవస్థ**

**అంటువ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరిక**

**విద్యాధికారుల మధ్య చర్చానియాంశంగా మారిన బోధన అంశం**

*తెలంగాణాలో ఇటీవల కురిసిన భారీ మరియు అతి భారీ వర్షాల వల్ల గ్రామాలలో మాత్రమే కాకుండా పట్టణ ప్రాంతాలలో కూడా రోడ్లు ఇరిగిపోవడం, అధిక వరద ప్రవాహాలు, విద్యుత్ స్థంబాలు కూలడం, వరదల ద్వారా కొంత ప్రాణ నష్టం లాంటివి అధిక నష్టం కలిగిందనే చెప్పవచ్చు. అధిక వర్షాల వల్ల రాష్ట్రంలో పాఠశాలలకు అధిక సెలవులు ప్రకటించడం జరిగిన విషయం తెలిసిందే.. కాగా ఈ వర్షాల వల్ల అధిక సంఖ్యలో పాఠశాలలలోకి వరద నీరు తరగతి గదులలోకి, ప్రాంగనాల్లోకి, పాఠశాలల విద్యుత్ బాక్స్ లలోకి చేరడం ద్వారా తరగతులు జరిగే అవకాశం తగ్గువగా ఉండనుందని విద్యాశాఖలో జరుగుతున్న చర్చ. అదే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా రవాణా వ్యవస్థలో బాగమైన రోడ్లు భారీగా విరగడం వల్ల ఇది కూడా ఒక కారణంగా ఉండనుంది.*

**హైదరాబాద్, జులై 28 (తీన్మార్ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం కూడా ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. ఇప్పటికే జూలై 20, 21, 26 తేదీల్లో ప్రభుత్వం సెలవులు ప్రకటించగా 22, 24, 25 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు పనిచేసినా దాదాపు 80 శాతం మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జూలై 29న మొహర్రం సెలవు కాగా వర్షాలు, వరదల వల్ల నెలకొన్న ఇబ్బందులు కుదుటపడకపోతే జూలై 31 సైతం విద్యాసంస్థలు పనిచేయడం కష్టమని అధికారులు అంటున్నారు. పాఠశాల విద్యాశాఖ వివరాల ప్రకారం ఇప్పట్లో సజావుగా బోధన సాగే అవకాశం లేదని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 వేల స్కూళ్లలో కుండపోత వర్షాల వల్ల గదుల్లోకి, స్కూల్ ప్రాంగణాల్లోకి వరదనీరు చేరింది. దాదాపు 3 వేల స్కూళ్ల ఆవరణలో బురద పేరుకుపోయింది. 6,200 స్కూళ్లలో గోడలు చెమ్మపట్టడంతోపాటు విద్యుత్ బోర్డుల్లోకి నీరు చేరింది. 78 శాతం స్కూళ్లలో వర్షాలు తగ్గినా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ హాస్టళ్ల నుంచి చాలా మంది ఇళ్లకు వెళ్లిపోయారు. బడులు తెరిచినా గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల రవాణా వ్యవస్థ దెబ్బతిన్నందువల్ల వారంపాటు వారు తిరిగి రావడం కష్టమని అధికారులు భావిస్తున్నారు.



వర్షాల నేపథ్యంలో డెంగీ, మలేరియా, అంటువ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరిస్తోంది. తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందువల్ల స్కూళ్లు, హాస్టళ్ల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మండలస్థాయి ప్రకారం నివేదికలు తెప్పించుకోవాలని సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## ప్రజలు వర్షాలతో ఇబ్బందులు పడుతుంటే

# కేసీఆర్ ఎక్కడ.. కేటీఆర్ కవితలెక్కడ..?

**బీఆర్ఎస్ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉంటే.. కాంగ్రెస్ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో ఉంది**

**సంచలన విమర్శలు చేసిన బీజేపీ నేత ధర్మపురి అరవింద్**

**న్యూఢిల్లీ, జులై 28 (తీన్మార్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఏ1, ఏ2, ఏ3లని, ఎవరికెవరు బీ టీమ్‌లు కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బీఆర్ఎస్ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో, కాంగ్రెస్ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో ఉందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతుందని, అందుకే కాంగ్రెస్‌ను లేపాలని కేసీఆర్ చూస్తున్నారని ఆరోపించారు. గురువారం బీజేపీ నేత బస్వ లక్ష్మీ నర్సయ్యతో కలిసి పార్లమెంట్ ఆవరణలో మీడియాతో అర్వింద్ మాట్లాడారు. కేసీఆర్ చెప్పినోళ్లకే కాంగ్రెస్ పార్టీలో టికెట్లు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లను కంట్రోల్‌లో పెట్టుకోవాలి. మనం గెల్వని చోట్ల కాంగ్రెస్ వాళ్లను గెలిపించుకోవాలి. తర్వాత ఆ ఎమ్మెల్యేలను కొనుక్కోవాలి ఇది కేసీఆర్ చేసే పని అని మండిపడ్డారు. పార్లమెంట్‌లో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్ జై కొట్టడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొంగతనం బయటపడిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు రూ.30 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. కనీసం 3 రూపాయలు కూడా ఖర్చు పెట్టలేదని ఆరోపించారు. ఈ పైసలన్నీ కాళేశ్వరంలో ముంచుడు, కవితకు మళ్లించుడు అన్నట్లు కేసీఆర్ పనితీరు ఉందన్నారు. రాష్ట్రంలో వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పండుకున్నాడా.. అని అర్వింద్ ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా ప్రగతి భవన్, ఫాం హౌస్‌ల నుంచి తండ్రి, కొడుకు, కూతురు బయటకెళ్లి ప్రజలను ఆదుకోవాలన్నారు. వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో మంత్రులు పర్యటించాలని డిమాండ్ చేశారు. కరోనా టైమ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ప్రజల్లో తిరిగారని, ఇప్పుడు భారీ వర్షాల సమయంలో కవిత ఎటు పోయిందని ప్రశ్నించారు. తెలంగాణ రోడ్లు కొట్టుకపోయాయని, దయచేసి బయటికెళ్లొద్దని రాష్ట్ర పోలీసులు తనకు మెసేజ్‌లు పెడుతున్నారని, ఆర్ అండ్ బీ మంత్రి ప్రశాంత్ రెడ్డి తన తమ్ముడు, బామ్మర్దులకు కాంట్రాక్ట్‌లు ఇస్తే రోడ్ల పరిస్థితి ఇలాగే ఉంటుందని ఫైర్ అయ్యారు. మరోవైపు, ప్రతిపక్షాల కూటమి పేరు ఇండియా కాకుండా, ఇటలీ అని పెట్టుకుంటే బాగుండేదని అర్వింద్ ఎద్దేవా చేశారు. అప్పుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్‌కు శాశ్వత అధ్యక్షుడిగా ఉండేవారన్నారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నిజాయితీగా కొట్లాడేటోళ్లకు కాంగ్రెస్‌లో చోటే లేదని, పైగా పార్టీ నుంచి పోవాలని పొగ పెడుతున్నారన్నారని విమర్శించారు.

## జంపన్నవాగులో మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరిహారం

### నష్టపోయిన వారందరిని ఆదుకుంటాం : మంత్రి సత్యవతి రాథోడ్

**ములుగు, జులై 28 (తీన్మార్ న్యూస్):** జంపన్నవాగు ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు సాయం అందజేయాలని తక్షణ సాయంగా రూ.25 వేలు అందజేయాలని ప్రభుత్వం పేర్కొంది. కాగా ఈ ఘటనలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించగా 3 మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను చూసిన వారి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వీరి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.4 లక్షలు అలాగే తక్షణ సాయం కింద 25 వేలు అందజేయనున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. అలాగే వరదల వల్ల నష్టపోయిన వారందరిని కూడా ఆదుకుంటామని మంత్రి తెలిపారు. కాగా గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హైదరాబాద్ సహా పలు జిల్లాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగగా ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. ఇక ములుగు జిల్లా మల్యాల మండలంలో వరద ధాటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో లేనంతగా మేడారాన్ని వరద నీరు కమ్మేసింది, సమ్మక్క-సారలమ్మ గద్దెల వరకు నీరు వచ్చిందంటే ఎంతటి ప్రమాదమో ఊహించవచ్చు. ఇక జంపన్నవాగు వణుకు పుట్టిస్తుండగా అందులో ఎనిమిది మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం వెతకగా మొదట ఐదుగురు తాజాగా మరో ముగ్గురి మృతదేహాలు లభించాయి. తెలంగాణలో వర్షాలు మామూలుగా లేవు. గత వారం రోజులుగా కురిసిన వాన ఒకెత్తయితే..బుధవారం రాత్రి కురిసిన వాన మరోఎత్తు. ఎందుకంటే ఈ వర్షం ధాటికి రాత్రికి రాత్రే కుంటలు, చెరువులు నిండిపోయాయి. ఇక వరదల ధాటికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. మరో 48 గంటలు ఇలాగే భారీ వర్షాలు నెలకొని ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే రాష్ట్ర చరిత్రలోనే అత్యంత భారీ వర్షపాతం ములుగు జిల్లాలో నమోదు అయింది. గడిచిన 24 గంటల్లో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో ఏకంగా 649.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

## భారీ వర్షాలతో రాష్ట్రం అల్లకల్లోలమవుతున్నా దొర గడి దాటడు

### ట్విట్టర్ ద్వారా కేసీఆర్ పై మండిపడ్డ షర్మిల

**హైదరాబాద్, జులై 28 (తీన్మార్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ వైఎస్ఆర్ సీపీ పార్టీ అధ్యక్షురాలు షర్మిల మరోసారి ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో గ్రామాలు మునిగిపోతున్నా, ఇండ్లు కూలిపోతున్నా, జనం వరదల్లో కొట్టుకుపోతున్నా కూడా కేసీఆర్ మాత్రం గడప దాటి బయటకు రావడం లేదని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. వానలు వెలిసిన తర్వాత చుట్టం చూపుగా గాలి మోటార్లో చక్కర్లు కొడతారని, ఆదుకుంటామని గొప్పలు చెబుతారని వ్యాఖ్యానించారు. గత ఏడాది నుంచి గేట్లు మొరాయించినా కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారు

### ఆగస్టు 3 నుంచి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు

**తెలంగాణ బ్యూరో, జులై 28 (తీన్మార్ న్యూస్):** తెలంగాణ వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారు అయింది. ఆగస్టు 3 నుంచి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరికొన్ని నెలల్లో ఎన్నికలు ఉండగా అసెంబ్లీ సమావేశాలు ఆసక్తికరంగా మారాయి. కాగా అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజు బీఏసీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఎన్ని రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. కాగా ఇటీవల రాష్ట్రాన్ని వరదలు కుదిపేసిన నేపథ్యంలో ప్రతిపక్షాలకు ఇది అస్త్రంగా మారనుంది. ప్రజల సమస్యలపై ప్రతిపక్షాలు తమ గొంతును వినిపించే అవకాశాలున్నాయి. కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు. అయితే గత బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం లేకుండానే జరిగాయి. అయితే ఈసారి ఇంచుమించు తమిళిసై ప్రసంగం ఉండదని అంతా భావించారు. కానీ రెండడుగులు వెనక్కి తగ్గిన కేసీఆర్ సర్కార్ గవర్నర్ కు ఆహ్వానం పంపించడం, తమిళిసై బడ్జెట్ కు ఆమోదం తెలపడం జరిగిపోయాయి. అయితే ఆగస్టులో మళ్లీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే ఈసారి సమావేశాలు హాట్ హాట్ గా సాగనున్నట్లు తెలుస్తుంది. నెల 31న మంత్రి మండలి సమావేశం కావాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. తెలంగాణ నూతన సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో ప్రధానంగా 50 అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తుంది. ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలు, ప్రభావిత ప్రాంతాలు, ఆయా పరిస్థితులపై కేబినెట్ లో చర్చ జరగనుంది.

## 81 మందికి డిప్యూటీ కలెక్టర్లుగా తహసీల్దార్లకు పదోన్నతి

**హైదరాబాద్, జులై 28 (తీన్మార్ న్యూస్):** తెలంగాణ సర్కారు తహసీల్దార్లకు గుడ్ న్యూస్ చెప్పింది. 81 మందికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. వారి పేర్లతో ఉన్న జాబితాకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఇప్పటికే 19 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు ఇచ్చిన ప్రభుత్వం మరో 81 మందికి తాజాగా పదోన్నతులు ఇవ్వడంతో మొత్తం 100 మందికి పదోన్నతులు ఇచ్చినట్లు అయింది. 100 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పదోన్నతులు పొందిన వారిలో ఐదుగురు సచివాలయంలో విధులు నిర్వర్తించే సెక్షన్ ఆఫీసర్లు కూడా ఉన్నారు. రెవెన్యూ సహా వివిధ శాఖల్లో ఖాళీలకు అనుగుణంగా 81 మందికి పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది.

# దివ్యాంగుపై వివక్షత

## దివ్యాంగులు వేరేదారి చూసుకోక తప్పదా..?



**ఏ చరిత్ర చూసిన ఏముంది గర్వకారణం దివ్యాంగుల ఓటు బ్యాంకు దోపిడి తప్ప**

**జనాభాలో దివ్యాంగులు 20 శాతం పైనే**

**దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు అసలు రావడం లేదు..?**

**అవకాశాల్లో రోస్టర్ల మార్పును పట్టించుకునేవారే లేరు**

**హక్కుల సాధన కొరకు శాంతియుత పోరాటాలకు సిద్ధం**

కులం, మతం, లింగం, ప్రాంతం, హొదాలతో సంబంధం లేకుండా దివ్యాంగులు సమాజం నుంచి ఎదుర్కొంటున్న వివిధ వివక్షను, హింసను అరికట్టడానికి చర్యలు గైకోని దివ్యాంగులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సంస్కృతిపరంగా అభివృద్ధి చేయాలి.

స్వాతంత్యం వచ్చి 76 సంవత్సరాలైన దివ్యాంగులు రాజ్యాధికారం మరియు రాజ్యాధికారం లేక తర తరాలుగా దోపిడి, పీడన అత్యంత అవమానాలకు, అన్యాయాలకు, అపహాస్యాలకు, హేళనకు, వేధింపులకు, వివక్షతకు గురవుతున్నారనేది జగద్విదితం. 2016 కన్న ముందు ఏడు రకాల వైకల్యాలు కల్గిన దివ్యాంగులు మొత్తం జనాభాలో పదిశాతం వుంటే, అదే 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలను దివ్యాంగులుగా గుర్తించడం జరిగింది. ఈ లెక్కన మొత్తం జనాభాలో దివ్యాంగులు 20 శాతం పైన వుండవచ్చు. 20 శాతం దివ్యాంగులైతే వారి ఇంటిలో కనీసం ముగ్గురు సకలాంగులు వున్న దివ్యాంగుల ఇంటిలో దాదాపు 50 శాతం ఓటర్లు ఉన్నారనేది యధార్థం. ఈ 21 రకాల వైకల్యాల్లో శరీరక వైకల్యాం వున్న దివ్యాంగుల జనాభా అత్యధికంగా వుంటుంది. దివ్యాంగులకు విద్యా పరంగా 5 శాతం, ఉద్యోగ పరంగా 4 శాతం రిజర్వేషన్ అమలు చేస్తుంది. అసలు ఉన్నత విద్య చదివే దివ్యాంగులు 2 శాతం కన్న ఎక్కువ వుండరు. ఉద్యోగ రిజర్వేషన్ రోస్టర్ చూపులేని వారికి 6, వినపడని వారికి 31, శరీరక వైకల్యం వున్న వారికి 56, బహు వైకల్యం వున్నవారికి 84 వుంచటం జరిగింది. దీని మూలంగా శరీరక వైకల్యం దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు అసలు రావడం లేదనేది తేటతెల్లం. అంతేకాక ఏదైన ఒక్క రోస్టరకు దివ్యాంగులు దొరక పోయిన ఆ రోస్టర్ అలానే వుంచడం మూలంగా వేరేవారికి అసలు అవకాశం రావడం లేదు. ఉన్నత చదువులు చదివిన అసలు కొంత మంది దివ్యాంగులు కూడ ఉన్న వనరులను తమ వైకల్యం మూలంగా అందిపుచ్చుకోలేక చావలేక, బతకలేక జీవచ్ఛవళుళ్గా కొట్టుమిట్టాడుతున్నారు. దివ్యాంగులు రోస్టర్లను పదిలోపు కుదించమని నెత్తి నోరు కొట్టుకొని మొరపెట్టుకుంటున్న పట్టించుకున్న రాజాకీయాధిపతులుగానీ, పాలనాధిపతులు గాని మచ్చుకైన కనపడుట లేకపోవడం శోచనీయం. ఆంధ్ర వలస పాలనలో అత్యంత వివక్షతకు, నిరాధరణకు, నిర్లక్ష్యానికి గురైన దివ్యాంగులు ప్రత్యేక్ష తెలంగాణ రాష్ట్రం వస్తే తమ బతుకులు మారతాయని నేను సైతం అని అన్ని వర్గాల కన్నా ముందు వరసలో ఉండి ప్రత్యేక రాష్ట్రం కొరకు ఎన్నో ఉద్యమాలు చేసినారు. ఏ చరిత్ర చూసిన ఏముంది గర్వకారణం దివ్యాంగుల ఓటు బ్యాంకు దోపిడి తప్ప అనే చందంగా దివ్యాంగులను ఒక పెన్షన్ కు పరిమితం చేసినారు పరిమితం చేసినారు. మిగతా వర్గాలకు పది లక్షల లాభం చేస్తే దివ్యాంగులకు వెయ్యి రూపాయల లాభం చేసే పనులు కూడా చేయడం లేదు. ప్రభుత్వంలోని అన్ని రంగాల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యం, భాగస్వామ్యం చేయాలనే సోయి లేకుండా పాలన కొనసాగిస్తూ, దివ్యాంగుల ఆత్మగౌరవం మీద రాజకీయాధిపతులు దెబ్బ కొట్టుతున్నారనేది యధార్థం. విధాన పరమైన మౌలికాంశాలను ఏకోశాన పట్టించుకున్న దాఖళాలు ఈ తొమ్మిది సంవత్సరాల్లో కనిపించలేదు. ఈ తొమ్మిది సంవత్సరాల్లో కనీసం దివ్యాంగుల దినోత్సవంకు ఒక్కసారైన ముఖ్యమంత్రి కెసిఆర్ హాజరు కాకపోవడం వల్ల దివ్యాంగులు ఎంతో మనో వేదనకు గురవుతున్నరనేది వాస్తవం.

ఎస్.సి., ఎస్.టి., బి.సి. కొన్ని వర్గాలకు వరాల మీద వరాలు ప్రకటిస్తున్న ముఖ్యమంత్రికి దివ్యాంగుల హక్కుల చట్టం - 2016లో వున్నవాటినైనా అమలు చేయకుండా, దివ్యాంగుల కమీషన్ నైనా ఏర్పాటు చేయుకుండా గాలికి వదిలి వేయడం జరిగింది. మనసున్న కొంతమంది ప్రజాప్రతినిధులు దివ్యాంగుల సమస్యల పరిష్కారం కొరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొనిపోయినా పట్టించుకున్న పాపానపోలేదు. ప్రతి ఎన్నికల సమయంలోనే 20 శాతం వున్న దివ్యాంగుల ఓటు బ్యాంకును మిగత పార్టీలకన్న అధికార పార్టీయే ఎక్కువగా వాడుకోవడం జరిగింది. తర్వాత దివ్యాంగుల సమస్యలను పట్ల నిమ్మకు నీరెత్తినట్లుగా వుంటూ, కళ్ళు బొల్లి కబుర్లు చెప్పుకొంటూ వస్తున్నారని దివ్యంగులు చాల కసిగా వున్నారు.

అయిన వాళ్ళు, అటు సమాజం, ఇటు పాలకులు చూపుతున్న వివక్ష పూరిత నిర్ణయాల మూలంగా దివ్యాంగులు మరింత పేదరికం పాలై బిక్షకులుగా మారిపోతున్నారు. దివ్యాంగుల హక్కుల చట్టాలు 1995, 2016 ప్రకారం విద్యా, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ రిజర్వేషన్లను పట్టించుకున్న పాపన పోవడం లేదు. ఏలిన, ఏలుతున్న పాలకులు దివ్యాంగులను రాజ్యాధికారానికి అంటరానివారుగా దూరంగా ఉంచుతున్నారు. చట్ట సభల్లో, విధాన నిర్ణయాల్లో దివ్యాంగుల భాగస్వామ్యం లేకపోయేసరికి దివ్యాంగుల సమస్యలను సోయిలేని సకలాంగ ప్రజా ప్రతినిధులతో పరిష్కారాలు కావడం లేదు. అందరికీ అన్ని సాధికారితలు కల్పిస్తున్న ప్రభుత్వాలు దివ్యాంగుల సాధికారిత సాధించడమే తమ లక్ష్యమని ఏ ప్రభుత్వాలు చెప్పుతున్న దాఖళాలు సెర్చ్ లైట్ వేసి వెదికినా కనపించడం లేదు. మరో వైపు కంచే చేను మేసిన చందంగా దివ్యాంగుల హక్కులను కాపాడవలసిన, భద్రత కల్పించవలసిన ప్రభుత్వాధికారులే ఆ స్ఫూర్తికి తిలోదకాలు ఇస్తున్నారు.

ఇటువంటి దయనీయ పరిస్థితుల్లో దివ్యాంగులు ఏకతాటిపై అందరిని ఐక్యం చేసి "పోరాడితే పోయేది ఏమిలేదు హక్కుల సాధన తప్ప" అని చైతన్యం చేసి అన్ని రాజకీయ పార్టీలకు కనువిప్పు కల్గే విధంగా శాంతియుత పోరాటాలకు సంసిద్ధం కావలసిన అవసరం ఎంతైనా వుంది.



ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు
దివ్యాంగుల హక్కుల, సాధికారిత సంస్థ అధ్యక్షులు
మరియు కాకతీయ యూనివర్శిటీ, ప్రజా పాలనా శాస్త్రం

### మన పాలక ప్రభుత్వాలు చేయాల్సిన పనులు (సూచనలు):

- ప్రతి జిల్లాలో దివ్యాంగుల కేటగిరి వారిగా హాస్టల్ తో కూడిన గురుకుల స్కూల్స్ ఏర్పాటు చేయాలి.
- మండల స్థాయిలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేకాధికారిని నియమించాలి.
- ప్రతి జిల్లాలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి సమస్యలపై చర్యలు, సూక్ష్మ స్థాయి పరిశీలన, పరిశోధన జరగాలి.
- దివ్యాంగుల సంక్షేమానికి మొత్తం రాష్ట్ర బడ్జెట్ లో జనాభా ప్రాతిపదికన కేటాయించాలి.
- ప్రతి జిల్లాలో ప్రత్యేక స్టడీ సెంటర్లను ఏర్పాటు చేయాలి.
- దివ్యాంగ ఉద్యోగులకు ఉన్నత చదువుల కోసం వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగుల అలవెన్సును రూ. 5000 లకు పెంచాలి.
- దివ్యాంగ ఉద్యోగులకు ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలి.
- నామినేటెడ్ పోస్టులో దివ్యాంగులకు ప్రాధాన్యత మివ్వాలి.
- 2016 చట్టం ప్రకారం ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రంలో ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి.
- మహిళ రిజర్వేషన్ బిల్లులో కూడా దివ్యాంగ మహిళలకు రిజర్వేషన్ ఉండాలి.
- ప్రతి దివ్యాంగుడికి 5 ఎకరాల భూమి ఇవ్వాలి.
- ప్రత్యేక అత్యాచార, అవమాన నిరోధక చట్టం చేయాలి.
- అన్ని పార్టీలు దివ్యాంగుల విభాగాలను ఏర్పాటు చేయాలి.
- దివ్యాంగుల జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. కనీసం 5శాతం అన్ని స్థాయిల్లో వెంటనే ప్రకటించాలి.
- దివ్యాంగుల జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ పెంచాలి.
- దివ్యాంగులకు దివ్యాంగ బంధు వెంటనే ప్రకటించాలి.
- పెళ్లి అయిన కాకపోయిన ప్రతి దివ్యాంగుడికి గృహ వసతి కల్పించాలి.
- 2016 చట్టం ప్రకారం 21 వైకల్యాలను కేటగిరి వారిగా వెంటనే ప్రకటించాలి.
- దివ్యాంగుల పెన్షన్ 4016 రూపాయల నుండి 10,000 రూపాయలకు పెంచాలి.





